ఆఫీసులో పదేళ్ల సర్వీసు పూర్తయాక నాకు గవర్నమెంటు క్వార్టర్ ఇచ్చారు. ఈ పదేళ్లలో అద్దె కొంపల్లో మేం పడ్డపాట్లు అన్నీ ఇన్నీ కావు. క్వార్టర్ ఇవ్వగానే ఎగిరి గంతేసి వెంటనే చేరి పోయాం.

ఇల్లు మార్చినందు వల్ల మా అబ్బాయి స్కూలు కూడా మార్చాల్సి వచ్చింది. అదృష్టవశాత్తు మా క్వార్టర్స్‌కి దగ్గర్లోనే మంచి స్కూల్లో వాడికి సీటు దొరికింది. వాడక మొన్ననే తొమ్మిదేళ్లు నిండాయి. ప్రస్తుతం అయిదో క్లాసు చదువుతున్నాడు.

కొత్త స్కూలు, కొత్త టీచర్లు, కొత్త వాతావరణం, కొత్త స్నేహితులు - అంతా కొత్త. అయినా వాడు కొత్తదనానికి బాగానే అలవాటు పడ్డాడు.

స్కూల్లో చేరిన నాలుగు రోజుల తర్వాత ఓ ఉదయమే నా దగ్గరికి వచ్చి "నాన్నా - న్యూస్ రాసి పెడతావా?" అనడిగాడు.

నాకు అర్థం కాలేదు. అదే అడిగాను.

వాళ్ల స్కూల్లో ఓ పద్ధతి ఉందట.

రోజూ ఉదయమే స్కూల్ అసెంబ్లీ జరుగుతుంది. అసెంబ్లీలో ప్రార్థన అయ్యాక పిల్లలు ఆ రోజు వార్తల్లోని ముఖ్యాంశాలు చెప్పాలి.

వారంలో ఒక్కో రోజు ఒక్కో క్లాసు పిల్లలకి ఆ అవకాశం ఇస్తారు. ఆ రోజు వాడి క్లాసు వాళ్లు వార్తలు చదవాలి.

వాడు వివరించి చెప్పాడు.

నా కీ పద్ధతి కొత్తగానే కాదు - బావున్నట్టు కూడా అనిపించింది.

పిల్లలు రోజూ పేపర్ చదవాలన్నది స్కూల్ వాళ్ల ఉద్దేశ్యం. ప్రపంచంలో ఏం జరుగుతోందో వాళ్లకి తెస్తుంది. వీడికి ప్రతిసారి నేనే న్యూస్ రాసి పెడితే ప్రయోజనం దెబ్బతింటుంది.

"సరే - ఈవేళ నేను రాసిపెడతాను. వచ్చే సారి నుంచి నువ్వే రాసుకోవాలి" అన్నాను.

"సరే" అన్నాడు వాడు.

వెంటనే పెన్నూ ·కాగితం తీసుకుని సిద్ధమయ్యాను. వార్తలు ఎంపిక చేయడానికి పూనుకున్నాను.

మొదటి పేజీ తీశాను. పతాక శీర్షిక చూశాను.

"అసెంబ్లీలో ముష్టియుద్ధం"

అసెంబ్లీలో అధికార, ప్రతిపక్ష సభ్యులు కొట్టుకున్నారని, గాయాలు తగిలాయని కొందరు సభ్యుల్ని మార్షల్స్ బైటకి తీసికెళ్లారనీ - ఇదీ వార్త!

బోణీ బాగా లేదనిపించింది.

కొంచెం కిందికి చూశాను.

నగరంలో నడిబొడ్డున ఓ పోలీసాఫీసర్ని తీవ్రవాదులు హత్య చేశారు.రక్తం మడుగులో పడి ఉన్న ఆయన శవాన్ని రంగుల్లో ముద్రించారు. పేపర్ మీద రక్తం ఒలికిందేమో నన్న అనుమానం కలిగేటంత ప్రస్ఫుటంగా ముద్రించారు.

చూపుని మరో వైపుకి తిప్పాను.

ఓ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటరులో అయిదుగురు తీవ్రవాదుల్ని పోలీసులు చంపారు.

# హాహా..హీహీ

వీరభద్రరావు పమ్మి



అయిదుగురి శవాలు బోర్లాపడి ఉండి సాష్టాంగ నమస్కారం చేస్తున్నట్టుగా ఉన్నాయి.

ఇదీ పనికి రాదు.

పేపర్ మడిచి కిందకి చూశాను.

వంట నూనె కుంభకోణంలో ఇరుక్కున మంత్రి గారి గురించి పెద్ద వ్యాసం రాశారు.

మొదటి పేజీలో నా క్కావల్సిన వార్త దొరకలేదు.

రెండో పేజీలోకి వెళ్ళి పోయాను.

అప్పుడెప్పుడో జరిగిన బ్యాంక్ కుంభకోణం గురించి ఓ పెద్ద జర్నలిస్ట్ గారు ఇంగ్లీషులో రాసిన వ్యాసాన్ని తెలుగులో వేశారు.

ఎడిటోరియల్ కూడా అదే పేజీలో సాక్షాత్కరించింది.

పౌరహక్కులు కాలరాస్తున్న పోలీసు దుశ్చర్యల గురించి, కాళ్లూ చేతులు నరికేస్తున్న తీవ్రవాదుల దుందుడుకు తనం గురించి సమతూకంగా రాశారు.

ఈ పేజీలో కూడా నాకేమీ దొరక లేదు. తర్వాత పేజీలోకి వెళ్లిపోయాను. కట్నం తేలేదని ఓ ఆడపిల్లని భర్తగారు, అత్తగారు కలిసి కిర్సనాయిల్ పోసి తగుల బెట్టారనే విషయం బాక్స్ కట్టి వేశారు.

అదే పేజీలో మరో పక్కకు చూశాను.

రాష్ట్రంలో కిర్సనాయిల్ కొరత తీవ్రంగా ఉందనీ, వ్యాపారస్తులు సరుకు దాచెయ్యడం వల్ల ఈ కొరత ఏర్పడిందని రాశారు.

ఇంకో పక్కకి చూశాను.

భార్యను అనుమానించి ఓ భర్త ఆమెను కత్తితో పొడిచి చంపాడని, తర్వాత డిన్నర్‌కి వెడుతున్నంత ధీమాగా పోలీసు స్టేషన్‌కి వెళ్లి లొంగి పోయాడని రాశారు.

ఇంకాస్త కిందికి చూశాను.

పాతబస్తీలో మత కలహాలు చెలరేగి పొడుచుకున్నారనీ, నలుగురు మరణించారనీ, ఇరవై మందికి గాయాలయ్యాలనీ - ఇదీ వార్త.

మరి కాస్త కిందికి చూశాను. నగరంలోని ఓ మాజీ కార్పొరేటర్ ప్రధాన మంత్రి అవినీతి పరుడనీ, ఆయన వెంటనే పదవి నుంచి తప్పుకోవాలనీ డిమాండ్ చేస్తూ ఓ ప్రకటన ఇచ్చాడు.



ఆ పెజీ అచ్చు రాలేదని మరో పేజీలోకి వెళ్లి పోయాను.

ఓ మారు మూల గ్రామంలో రెండు కులాల మధ్య గొడవలు చెలరేగి ఇళ్లకి నిప్పంటించుకున్నారు. పోలీసులు అక్కడ గస్తీ తిరుగుతున్నారు. వారిలో కొందరు ఆ ఊరి ఆడవాళ్ల మీద అత్యాచారం జరిపారు.

అదే పేజీలో మరో వక్కకి చూశాను.

ఓ హరిజన స్త్రీని నలుగురు యువకులు మానభంగం చేశారు. నిందితులు పరారయ్యారు.

కొన్త కిందవైపుకి చూశాను.

అగ్రకులానికి చెందిన ఓ ఆడపిల్లను అల్లరి చేసినందుకు అగ్ర కులాల వారు ఆగ్రహించి నిమ్న కులాల వార్ని నలుగుర్ని పొలాల్లో తరిమి తరిమి పొడిచి చంపారు.

ఇంకొన్త కిందికి చూశాను.

వేరే పనేమీ లేనట్టు ఓ గూడ్స్ రైలు స్టేషన్లో ఆగి ఉన్న ఎక్స్‌ప్రెస్ రైలుని ఢీ కొట్టింది. ఏభై మందికి గాయాలు. కొన్ని వందల మంది దుర్మరణం.

మరో వక్కకి చూశాను.

విప్లవ పంథాకి చెందిన కొందరు యువకులు ఓ ఆర్టీసీ బస్‌ని తగుల బెట్టి "విప్లవం వర్థిల్లాలి" - "మావో గారూ జిందాబాద్" అని అరచి వెళ్లిపోయారు.

ఇంకొన్త కిందికి చూశాను.

పంజాబ్‌లో టెర్రరిస్టులు ఒక ఊరిలో నగం మందిని తుపాకులతో కాల్చి, కాల్చి, కాల్చి చంపారు. అదే పంజాబ్‌లో జరిగిన ఎదురు కాల్పుల్లో భద్రతా దళాల వారు ఇరవై రెండు మంది ఉగ్రవాదుల్ని మట్టుబెట్టారు.

మరో వక్కకి చూశాను.

ఒక ఊళ్లో ఒక ఇంటిని సోదా చేసిన పోలీసులకు నాలుగు వేల తుపాకులు, ఎనిమిది టన్నుల మందుగుండు సామాగ్రి దొరికింది.

ఈ వక్కకి చూశాను.

ఒక పట్నంలో పోలీస్ స్టేషన్లో లాకప్‌లో ఉన్నతన్ని పోలీసులు లాఠీలతో కొట్ట కూడని చోట కొట్టి చంపారు. అదేమిటని అడగడానికి వెళ్లిన పౌరుల మీద విచ్చుకత్తుల తుపాకీలతో కాల్పులు జరిపారు.

తర్వాత పేజీలోకి వెళ్లి పోయాను.

సినిమాల్లోను, సాహిత్యంలోను వస్తున్న బూతుని ఆపాలని ఓ సినిమా కవిగారు అనర్గళంగా ఉపన్యాసించారు. మీటింగ్‌లో ఉన్న కొందరు యువకులు నువ్వు బూతెందుకు రాస్తున్నావని కవి గార్ని నిలదీశారు. ఆయనేదో సమాధానం చెప్పి తప్పించుకున్నారు.

అదే పేజీలో మరో శరభ శరభ కవిగారితో ఇంటర్వ్యూ వేశారు. ఆయన అక్షరం తూణీరమనీ, అక్షరం ఆయుధమనీ, అక్షరం అంటే అక్షరమేననీ, అక్షరాన్ని అక్షరంతోనే కోయాలనీ, అక్షరం చంపుతుంది తప్ప చావదనీ - ఏవేవో అంటూ చెలరేగి పోయారు

ఆఖరి పేజీలోకి వెళ్లి పోయాను.

అనేక కోట్ల రూపాయలతో, అనేక భారీ సెట్టింగ్‌లతో, అనేకానేక స్టార్స్‌తో తీస్తున్న సినిమా వివరాలు -

కొన్ని అర్థ నగ్న ఫోటోలు -

కొన్ని రతి కార్యక్రమాన్ని సూచించే ఫోటోలు.

మళ్ళీ అన్ని పేజీలు తిరగేశాను.

హత్యలు -

మాన భంగాలు -

కుంభకోణాలు -

మత కలహాలు -

కులాల గొడవలు -

చావులు -

దోపిడీలు -

"ఏ బుద్ధ దేవుని జన్మభూమికి గర్వన్మృతి

అవే - అవే - అవే

ఇందులో వాడికి ఏ వార్త రాసివ్వాలి?

వాడి లేత మెదడులోకి ఏ గుండుసూది గుచ్చాలి? ఏ తుమ్మముల్లు కఠినంగా దింపాలి?

తీరా "నాన్నా - మరిదేవిటి? సుజలాం - సుఫలాం - మలయజ శీతలాం అని రోజూ ఉదయమే పాడుకుంటున్నాం కదా?" అని వాడడిగితే వాడి కలను ఎలా నిర్దాక్షిణ్యంగా కాలరాసెయ్యాలి?

అదొకటే కాదు - వాడు చాలా ప్రశ్నలడగొచ్చు - దేనికీ నా దగ్గర సమాధానం లేదు.

అసలు వాడి మొహంలోకి ఎలా చూడాలి?

గుచ్చి గుచ్చి చూసే వాడి చూపుల్ని ఎలా తప్పించుకోవాలి.

"భగవంతుడా? ఎంత పరీక్ష పెట్టావయ్యా?"

వాడు అన్నం తింటూ "నాన్నా రాశావా?" అనడిగాడు.

ఇపు డీ ఇబ్బంది లోనించి ఎలా బైట పడాలి?

పోనీ ఈ బాధ వదుల్చుకోడానికి ఇందులోంచి ఏదో ఒకటి వాడికి రాసిచ్చేస్తే వాడు దాన్నెలా అర్థం చేసుకుంటాడో?

వా డా వార్త స్కూల్లో చదివితే మిగిలిన పిల్లలు - పువ్వుల్లాంటి పిల్లలు - వాళ్లెలా అర్థం చేసుకుంటారో? వాళ్ల లేత మెదళ్లు ఎలా స్పందిస్తాయో?

వాళ్ల మనస్సుల్లోకి ఏ మేకు కొట్టాలి? ఏ విష బిందువులు కురిపించాలి?

నాకు చాలా ఇబ్బందిగా అనిపించింది.

నాకు చాలా సిగ్గుగా అనిపించింది.

అసహాయంగా, అసహనంగా మళ్ళీ దిన పత్రిక అంతా తిప్పాను.

మళ్లీ, మళ్లీ తిప్పాను.

హమ్మయ్య - బతికి పోయాను. దొరికింది - అద్భుతమైన వార్త దొరికింది. భగవాన్ - నువ్వు నా యందున్నావ్ - న న్నీ అవస్థ నుంచి కాపాడావు.

ఇందాకట్నుంచి ఈ వార్త ఎలా మిస్సయ్యాను.

కళ్లు మరింత పెద్దవి చేసుకుని చూశాను. నా అదృష్టం బావుంది. "దేశంలో శాంతి పరిస్థితుల పరిస్థితి సంతృప్తికరంగా ఉంది. కేంద్ర హోం మంత్రి ప్రకటన."

హోం మంత్రి - బతికించావ్!

నా గౌరవం దక్కించావ్!

నా మానం కాపాడావ్!

నా పిల్లాడి ముందు తల దించుకునే పరిస్థితి నుంచి నన్ను రక్షించావు.

నీకు వేల వేల కృతజ్ఞతలు -

హోం మంత్రీ! నీకు శిరను వంచి నమస్కరిస్తున్నాను.

నువ్వు కలకాలం ఆయురారోగ్య ఐశ్వర్యాలతో వర్థిల్లు - బతికున్నంత కాలం నీకు పదవీ యోగం కలుగు గాక!

నిన్ను చేయెత్తి దీవిస్తున్నాను!

నువ్వు చేసిన మేలు ఎప్పటికీ మర్చి పోలేను!

భలే కాపాడావ్ బాస్!

అదే వార్త - తెల్ల కాగితం మీద పెద్ద పెద్ద అక్షరాల్తో రాసిచ్చాను. ఆ కాగితం మా వాడి చేతికందిస్తూ చూశాను.

ఇంత సేపూ మల్లెపువ్వులా తెల్లగా ఉన్న కాగితం రంగు మారుతోంది.

అపుడే వేటాడిన డేగ ముక్కులా ఎర్రగా, ఎర్రగా, ఎర్రెర్రగా - ఇంకా ఎర్రగా.......



## ఔషధ కంతుడు

**చింతలూరులో ఆయుర్వేద ఫార్మసీవారు రోగులకు మందుల్ని పోస్టు పార్శిల్లో పంపుతూ ఉంటారు. ఆయుర్వేదంలో భస్మాలు, చూర్ణాలు ఎక్కువగా ఉంటాయి. అవి చిన్న చిన్న పొట్లాలు కట్టి "పూట కొక పొట్లం మంచినీళ్లతోనో, లేక తేనెతోనో సేవించండి" అని అనుపానాలు రాస్తుంటారు.**

**అలాగే మందు ఓ అమాయక శిఖామణికి పంపారు. ఓ వారం రోజుల తర్వాత అతని దగ్గర్నుంచి వచ్చిన ఉత్తరాన్ని చూసి అందరూ నవ్వుకోసాగారు. ఇంతకూ అందులో అతను రాసిన దేమిటంటే - "అయ్యా! మీరు కట్టిన పొట్లములు లోగడ పంపిన వాని సైజు కంటే పెద్దవిగా ఉన్నవి. అందువలన మ్రింగుటకు కష్టముగా ఉన్నది. కావున పొట్లముల పరిమాణం తగ్గించ ప్రార్థన" అని.**

**పొట్లం వళంగానే మింగేసి గొంతులో నీళ్లు పోసుకుంటున్నా డా ఔషధకంతుడు!**

**చెళ్లపిళ్ల వెంకటశాస్త్రి [పాండిచ్చేరి]**